

ప్రముఖులకు ఆహ్వానం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు రావాలంటూ పలువురు ప్రముఖులకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి శుక్రవారం ఆహ్వాన పత్రికలను అందజేశారు. తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రముఖ అగ్ర నటుడు మెగాస్టార్ చిరంజీవి, యువ నటుడు నితిన్, టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు, హిందూపురం ఎంఎల్ఎ బాలకృష్ణ ముక్కంటి ఆహ్వానం అందుకున్న వారిలో ఉన్నారు. మీరందరికి ఎమ్మెల్యే ముక్కంటి శేష వస్త్రాలు, జ్ఞాపికలు అందజేసి శివరాత్రి ఉత్సవాలకు రావాలని ఆహ్వానించారు.









బర్డ్‌ఫ్లూ భయం

బిజినెస్(లె)స్...బేజారు

- కిలో రూ.150కి పడిపోయిన ధర
- గురుకులాల్లోనూ పదిరోజులు 'బ్రేక్'

ప్రజాశక్తి - రామచంద్రాపురం

'బర్డ్‌ఫ్లూ' భయం తిరుపతి, చిత్తూరు జిల్లాలను వెంటాడుతోంది.. మొన్నటివరకూ చిన్న చిన్న చికెన్ అంగళ్లలో 150-200 కిలోల అమ్మకాలు జరిగేవి. ప్రస్తుతం పది కిలోలు కూడా పోవడం లేదన్నది చిరువ్యాపారుల ఆవేదన. ఎక్కడో బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్ జిల్లానూ కుదిపేస్తోందని వారు వాపోతున్నారు. ఈనెల 16వ తేదీ ఆదివారం కూడా అమ్మకాలు సగానికి పైనే పడిపోయే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. చికెన్ వ్యాపారం కుదేలు కావడంతో బాయిలర్ కోళ్ల పెంపకందార్లు దిక్కుతోచకుండా ఉన్నారు. బాయిలర్, లింగాపురం, లేయర్ కోళ్ల మాంసం ధరలు తగ్గిపోయాయి. చికెన్ సెంటర్ల వైపు కష్టమర్లు కన్నెత్తి చూసే పరిస్థితి లేదని షాపు యజమానులు వాపోతున్నారు. వారంరోజులుగా చికెన్ వ్యాపారం నష్టాలనే చవిచూస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణ పరిస్థితుల్లో మార్పుల వల్లనో, ఇటీవల పులికాట్ సరస్సులో నిర్వహించిన ఫ్లమింగ్ ఫెస్టివల్స్‌కు వివిధ దేశాల నుంచి పక్షులు రావడం వల్లనో 'బర్డ్‌ఫ్లూ' వచ్చి ఉంటుందని పెద్దఎత్తున ప్రచారం జరుగుతుండడంతో 'చికెన్' ప్రియులు 'చేపలు' కొనుక్కుని తినే పరిస్థితి. చికెన్ ధరలు 240 నుండి 150 రూపాయలకు తగ్గింది. కోడిగుడ్ల ధర ఆరు రూపాయల నుండి ఐదు రూపాయలకు తగ్గింది. బర్డ్ ఫ్లూ వ్యాధి వ్యాప్తి చెందుతుందన్న అపోహతో చికెన్ కోడిగుడ్ల ధరలు తగ్గిపోవడంతో వ్యాపారస్తులు, పౌల్ట్రీ యజమానులు భారీ నష్టాలను చవి చూడాల్సి వస్తుంది.

రామచంద్రాపురం మండలంలో 13 లేయర్, 3 బాయిలర్ పౌల్ట్రీలు ఉన్నాయి. కమ్మపల్లి, పారకాలువ, నెన్నూరు, గణేశ్వరపురం, లింగమనాయుడు కండ్రిగ, వెంకట్రామపురం, కమ్మకండ్రిగ, సి.రామాపురం, రామచంద్రాపురం గ్రామాల్లోని కోళ్ల ఫారాల్లో ఏడు లక్షల గుడ్లు పెట్టే కోళ్లను పెంచుతున్నారు. రేకలచేను, కొత్తవేపకుప్పం, కుప్పంబాదూరు గ్రామాల్లో 10వేల బ్రాయిలర్ కోళ్లను పెంచుతున్నారు. ఇళ్ల వద్ద 12వేల పెరటికోళ్లను పెంచుతున్నట్లు పశు సంవర్ధక శాఖ అధికారుల లెక్కలు. కోళ్లఫారాల వద్ద ఈగలు, దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోళ్లఫారాల యజమానులకు సూచనలు ఇచ్చామని కమ్మపల్లి పశు వైద్యాధికారి డాక్టర్ జయకుమార్ తెలిపారు. కొద్దిరోజులపాటు కోడి మాంసం, గుడ్లను 100 డిగ్రీల ఉష్ణోగ్రతలో ఉడికిన తర్వాత తినాలని సూచించారు. భయపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.



హేమంత్ చికెన్ సెంటర్‌లో కొనేవారు లేక ఖాళీగా సిబ్బంది


చికెన్ కొనే వాళ్లు తగ్గిపోయారు :

కె.హేమంత్, చికెన్‌సెంటర్, చుట్టుగుంట రామాపురం

కోళ్లకు బర్డ్ ఫ్లూ వ్యాధి సోకిందని ప్రచారం కావడంతో గ్రామాలలో చికెన్ కొనేవాళ్లు పూర్తిగా తగ్గిపోయారు. గతంలో రోజుకు 300 కేజీలు అమ్మేవాళ్లం, ఇప్పుడు కనీసం 10 కేజీలు కూడా కొనేవాళ్ళు లేరు. కోడిగుడ్ల ధరలు కూడా తగ్గిపోయాయి. బర్డ్ ఫ్లూ మా పాలిట శాపంగా మారింది. అధిక రేట్లు పెట్టి కోళ్లు కొన్నాం. అమ్ముడు పోకపోవడంతో తక్కువ ధరలకు ఇచ్చిన కొనడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

డాక్టర్ జయకుమార్, పశువైద్యాధికారి



కోళ్లకు ఏవిఎన్ ఇంఫ్లుఎంజా వైరస్ సోకడం వల్ల బర్డ్ ఫ్లూతో చనిపోతున్నాయి. బర్డ్ ఫ్లూ వచ్చిన కోళ్లకు కోళ్ల ఫారంలో ఉపయోగించిన దాణా, కోడి మాంసం, వ్యర్థాలను జాగ్రత్తగా పాలిథిన్ సంచిలో పెట్టి దూర ప్రాంతంలో పూడ్చి పెట్టడం గాని, కాల్చివేయడం గాని చేయాలి. కోళ్ల షెడ్లను పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో ప్రతిరోజూ శుభ్రపరుచుకోవాలి. కూలీలు కోళ్ల ఫారంలోకి ప్రవేశించేటప్పుడు చేతులు, కాళ్లు డెటాయిల్‌తో పరిశుభ్రం చేసుకోవాలి. ప్రస్తుతం ఈ వ్యాధి తిరుపతి పరిసర ప్రాంతాలలో లేదు. వ్యాధి ఎక్కడా లేనందున ముందస్తు జాగ్రత్తలు ప్రజలు తపనిసరిగా తీసుకోవాలి. బయట ప్రాంతాల నుంచి కోళ్లను దిగుమతి చేసుకోకుండా చెక్ పోస్ట వద్ద ప్రత్యేక నిఘాను జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఎవరికైనా కోడి మాంసం తిన్న తరువాత జ్వరం, గొంతు బొంగురు పోవడం, ముక్కుకారడం, శరీరంపై దద్దుర్లు, ఒళు నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారికి చూపించుకోవాలి.

పెట్టుబడి కూడా రాదు : సిద్దయ్య, కోళ్లఫారం రైతు, యాదమరి

చికెన్ రేట్లు తగ్గితే మాకు పెట్టుబడి కూడా రాదు. మేము కోళ్ల ఫారం పెంపకం దారులం. మాకు లీజుకి ఇచ్చే కంపెనీలు కూడా రేట్లు తగ్గిస్తారు. దీంతో మాకు పెట్టిన పెట్టుబడి కూడా గిట్టుబాటు కాదు. కోళ్ల ఫారాల్లో పారిశుధ్యం చర్యలు చేపడుతున్నాము. వెటర్నరీ అధికారులు వచ్చి పరిశీలిస్తున్నారు. ప్రస్తుతానికి కోళ్లు ఏమీ చనిపోవడం లేదు. ఆరోగ్యకరంగానే ఉన్నాయి. ఎక్కడ రేట్లు పడిపోతాయోనని ఆందోళనగా ఉంది.

కోళ్ల పరిశ్రమ ఢమాల్

చిత్తూరు జిల్లాలో 8వేల కుటుంబాలు కోళ్ల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నాయి. అలాగే 20వేల కుటుంబాలకు ఉపాధి లభిస్తుంది. కోళ్ల ఫారాల్లో 70 లక్షల నుండి 80 లక్షల వరకు బాయిలర్స్, మూడు లక్షల నాటు కోళ్లు, 45 లక్షల లేయర్స్ కోళ్లు, లింగాపురం లక్ష వరకు పెంపకం సాగుతుంది. రోజువారి బాయిలర్స్ రెండు లక్షల కోళ్ళు కడప, చెన్నయ్, అనంతపురం, కర్ణాటక, తమిళనాడుకు సరఫరా అవుతుంటాయి. మరో 50 వేల కోళ్లు జిల్లా నలుమూలలకు సరఫరా అవుతున్నట్లు పౌల్ట్రీ రంగాల లెక్కలు చెబుతున్నాయి. గత వారంలో చికెన్ ధరలు 250 వరకు పలికింది. ప్రస్తుతం రూ.175కు దిగజారింది.

గురుకులాల్లో పది రోజులు బ్రేక్ : పి.మాధవీలత, ప్రిన్సిపాల్, కేవస్జీ గురుకులం ప్రిన్సిపాల్, శ్రీకాళహస్తి

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని గురుకులాల్లో పది రోజులపాటు విద్యార్థులకు చికెన్ వండి పెట్టరాదని బుధవారమే అధికారిక ఆదేశాలు అందాయి. ఆ మేరకు మంగళ, ఆదివారాల్లో పౌష్టికాహారంలో భాగంగా విద్యార్థులకు అందజేస్తున్న చికెన్ స్థానంలో మరేదైనా కర్రీ వండి పెట్టాలని సూచించాం.



తిరుపతి పంజాబ్ నేషనల్ బ్యాంకు ఎదుట

మార్చి 24, 25 తేదీల్లో సమ్మెలోకి...

బ్యాంకు ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

బ్యాంకు ఉద్యోగుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, లేదంటే వచ్చే నెల 24, 25 తేదీల్లో దేశవ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని బ్యాంకు ఉద్యోగులు ధర్నా చేశారు. దేశవ్యాప్తంగా 9 లక్షల మంది ఈ సమ్మెలో పాల్గొననున్నారు. శుక్రవారం సాయంత్రం యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంకు మునియన్ పిలుపు మేరకు స్థానిక టిపి ఏరియాలో ఉన్న పంజాబ్ నేషనల్ బ్యాంకు ఎదుట యు ఎఫ్ బి యు కన్వీనర్ పి. విజయ బాస్కర్, టీబీ ఈ సి సి ప్రధాన కార్యదర్శి జే. ధన్వంత్ కుమార్ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సరం మార్చి 8వ తేదీ ఐ బి ఏ యూనియన్ నాయకులతో ఒప్పందం ప్రకారం 15 రోజులలో తమ డిమాండ్లను పరిష్కరిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. బ్యాంకుల్లో ఉద్యోగ నియామకాలు చేపట్టాలని, వారానికి ఐదు రోజులు పని దినాలు కల్పించాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్‌చేశారు. ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. జనార్ధన్, భాస్కర్, కేశవరెడ్డి, సుమలతి, రేష్మ, నిర్మల, వెంకటలక్ష్మి, మహేష్ పాల్గొన్నారు.

రీసర్వే పకడ్బందీగా చేయాలి

ప్రజాశక్తి - కోట



రీ స ర్వే లో ఎలాంటి తప్పుల తడకలు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని కోట తహశీల్దార్ కె.జేజేరావు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే సుబ్బరాయుడు తెలిపారు. తహశీల్దార్ కార్యాలయంలో మండల సర్వేయర్, ఇతర గ్రామ సర్వేయర్లతో సమీక్షా సమావేశం శుక్రవారం జరిగింది. తహశీల్దార్ మాట్లాడుతూ అల్లంపాడు గ్రామంలో 821.38 సెంట్లు పట్టా భూమి, 201.43 సెంట్లు ప్రభుత్వ భూమి ఉందన్నారు. పైలెట్ ప్రాజెక్టును రీ సర్వే చేయాలని గ్రామ విఆర్ఓలకు సలహాలు సూచనలు ఇచ్చారు. సాగులో ఉన్న వారికి నోటీసులు పంపి, వారిని ఆయా భూముల వద్దకు రమ్మని ముందుస్తుగా సమాచారం ఇస్తున్నామన్నారు. ఈ సర్వేలో సబ్‌డివిజన్లు సరిచేస్తున్నామన్నారు. విఆర్ఒ పి.కృష్ణ, గ్రామ సర్వేయర్లు మహేష్, తేజస్విని, సుబ్రమణ్యం, హరికృష్ణ పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం : ఈఈ

తిరుపతి సిటి : తిరుపతి డివిజన్ సౌత్ సెక్షన్ పరిధిలో గల 33/11 కె.వి. టాటా నగర్ ఫీడర్ నందు 11 కె.వి. లైన్ లు, ఎల్.టీ లైన్ లు ట్రాన్స్ ఫార్మర్లు, ట్రి కటింగు లో విద్యుత్ లైన్ లకు ఆటంకం కలిగించే చెట్లను తొలగించుటకు, శనివారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ విన్నకోటి చంద్రశేఖర్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. టాటా నగర్ , పి.కె.లేఔట్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

దేశభక్తి గొప్పది

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, క్యాంపస్‌లో

పుల్వామా ఉగ్రవాదుల దాడిలో అమరులైన వీరజవాన్ల దేశభక్తి గొప్పదని ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ విస్డమ్ క్లబ్ అధ్యక్షురాలు, ఉయ్ సపోర్టు ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక చైర్మన్ తహసున్నీసా బేగం అన్నారు. అమరవీరుల దినోత్సవం పురస్కరించుకుని బేరివీధిలోని ప్రభుత్వ పాఠశాలలో అమరవీరులకు నివాళి అర్పించారు. ప్రధానోపాధ్యాయులు ఖాదర్‌బాషా, ఉపాధ్యాయులు మురళి, విస్డమ్ క్లబ్ ట్రైనర్స్ నాదముని, చెంచయ్య, జ్యోత్స్న పాల్గొన్నారు.

'మీ త్యాగం వృధా కాదు.. మీ ఆశయం ఆగిపోదు.. అమరవీరులైన సైనికుల త్యాగాలను మరచిపోకూడదు' అని రాష్ట్ర యూనివర్సిటీల కోకన్వీనర్ కామిరెడ్డి తరుణ్ అన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ప్రకాశం భవన్ ఎదుట పుల్వామా ఘటనలో అమరులైన సైనికులకు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య వక్త బట్టల అశోక్ మాట్లాడుతూ 2019, ఫిబ్రవరి 14వ తేదీన పుల్వామాలో భారత సైనికులను పాకిస్థాన్ తీవ్రవాద సంస్థ ఆత్మహుతి బాంబు దాడి వలన భారత సైనికులు 40 మంది చనిపోయారని అన్నారు. ఎస్వి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుధారాణి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి, యువత వాళ్ల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని, భారతదేశం కోసం ప్రాణాలను అర్పించిన సైనికులను గుర్తు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అశోక్, ఉమేష్, పురుషోత్తం రెడ్డి పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్ , ఎంఎల్ఎ ఆదిమూలం

సంజీవయ్య జీవన ప్రస్థానం స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన ఆదర్శప్రాయుడు, మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, సత్యవేడు ఎంఎల్ఎ కోనేటి ఆదిమూలం అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రాష్ట్ర పండుగగా అధికారికంగా దామోదరం సంజీవయ్య104వ జయంతి వేడుకల సందర్భంగా పుష్పాంజలి ఘటించారు. ఎంఎల్ఎ ఆదిమూలం మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో జన్మించి అంచెలంచెలుగా ఎదిగిన మహానాయకుడు, ఆదర్శప్రాయులని కొనియాడారు. 1976లో సంజీవయ్య అన్న కుమారుడు దామోదర మునస్వామి ఆధ్వర్యంలో తాము పుత్తూరులో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకల్లో నిర్వహించామని గుర్తు చేసుకున్నారు. జేసి శుభంబన్సల్, అడిషనల్ ఎస్‌పి రవి మనోహర్ ఆచారి, సాంఘిక సంక్షేమ సాధికార అధికారి విక్రమ్ కుమార్‌రెడ్డి, సమాచార పౌర సంబంధాల అధికారి బాలకొండయ్య పాల్గొన్నారు.

- గూడూరులో ఆలిండియా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ యునైటెడ్ ఫోరం ఆధ్వర్యంలో సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఫోరం అధ్యక్షులు డేగ రవి రాఘవేంద్ర, బిఎస్‌పి నాయకులు భాస్కర్‌గౌడ్, ప్రసాద్ పాల్గొన్నారు.

- తిరుపతి సిటీలో... శిల్పారామం వద్ద చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. సంజీవయ్య జీవన ప్రస్థానం సమాజానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. దళిత సంఘాల ప్రతినిధులు, దామోదరం సంజీవయ్య పార్కు అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కాంస్య విగ్రహానికి పూలమాలలతో నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు చింతమాకుల రెడ్డెప్ప, కలకట్ట రాధాక్రిష్ణ, పున్నాక సురేష్; పవన్‌కుమార్, శోభారాణి, కాణిపాకం రాజేష్ పాల్గొన్నారు.



తిరుపతి శిల్పారామంలో..



రుయాలో కలెక్టర్ వెంకటేశ్వర్

రుయాలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - తిరుపతి సిటి

రుయా ఆస్పత్రిలోని పలు విభాగాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. మెరుగైన వైద్యసేవలు పేదలకు అందించేలా పనిచేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఓపికగా రుయా ఆస్పత్రిలోని పలు విభాగాల్లో మౌలిక సదుపాయాలను పరిశీలించారు. క్యాజువాలిటీ ఎమర్జెన్సీ వార్డులో ఐసియూ బెడ్లు అవసరం మేకు లేవని, 40 బెడ్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ పారిశుధ్య కార్మికులు 220 మంది ఉండాల్సి ఉండగా, అందులో ఉదయం 120 మందికి గాను 89 మంది మాత్రమే ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరుగుదొడ్ల మరమ్మతులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలన్నారు. వినియోగంలో లేని పనికిరాని సామాగ్రిని నిబంధనల మేరకు డిస్పోజ్ చేయాలని ఆదేశించారు. అందుబాటులో లేని మందులను జాబితా తయారు చేసి 24 గంటల్లోపు మందుల ఏర్పాటు చర్యలు తీసుకోవాలన్నారు. ఎలక్ట్రోలైట్ పరీక్షలు రోగులకు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించగా ఆటోఅనలైజర్ మిషన్ సమస్య ఉందని తెలిపారు. మరమ్మతుకు గురైన మూడు సీరం ఎలక్ట్రోలైట్ టెస్టింగ్ మిషన్లను సత్వరమే అందుబాటులోకి తీసుకురావాలని ఏజెన్సీని ఆదేశించారు. పేషంట్ సహాయకుల భవనాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. . ఈ కార్యక్రమంలో రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు, డి ఎం హెచ్ ఓ బాలాజీ నాయక్, ఎస్వి మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, సి ఎస్ ఆర్ ఎమ్ ఓ సుబ్బలక్ష్మమ్మ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలన

యర్రావారిపాలెం.. మండలంలో రైతులు నిర్మించిన ప్యాక్‌హౌస్‌లు, గోకులం షెడ్లు, సిసి రోడ్లను కలెక్టర్ పరిశీలించారు. చెరుకువారిపల్లి పంచాయతీలో మామిడిచెట్లను పరిశీలించి మామిడిచెట్లు కాకుండా ఆదాయాన్ని ఇచ్చే ఇతర పంటలపై మొగ్గు చూపాలని రైతులకు సలహా ఇచ్చారు. సంతతోపు వరకూ రోడ్డు మరమ్మతు చేపట్టాలని గ్రామస్తులు కలెక్టర్‌కు అర్జీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీ శ్రీనివాస ప్రసాద్, ఏపీడి చిన్న రెడ్డప్ప, ఎంపీడీవో అరుణ, తాసిల్దార్ పరమేశ్వర స్వామి పాల్గొన్నారు.

శికారీలకు ప్రభుత్వ పథకాలు అందడం లేదు

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఆయా ప్రాంతాల్లో వాడుక బాషలను పట్టి వివిధ రకాలుగా తమను పిలుస్తున్నారని, ఇకపై వాగ్రివేల్ కమ్యూనిటీగా గుర్తింపు ఇవ్వాలని, ప్రభుత్వ పథకాలు అందడం లేదని అఖిల భారతీయ ఆదిమ మహా సంఘం జాతీయ అధ్యక్షులు రూప్ సింగ్ బాయ్ బార్పీడియా, తెలంగాణ రాష్ట్ర టిడిపి ఎస్టీ సెల్ అధ్యక్షులు గోపి కాలే, ఏబీఏఎం సంఘ జాతీయ మహిళా అధ్యక్షురాలు కుముదా సుశీలప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. శుక్రవారం తిరుపతి నగర పరిధిలోని గిరిజన భవన్ లో అఖిల భారతీయ ఆదిమ మహా సంఘం జాతీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన సంఘం ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎపిఎంఎం సంఘం జాతీయ సమ్మేళనంలో వక్తలు

మా పిల్లలకు విద్యను అందించండి : కుముదా సుశీలప్ప, శ్రీదేవి కృప, షిమోగా, కర్నాటక



దేశవ్యాప్తంగా ఉన్న రాష్ట్రాలలో శికారీలుగా పేర్కొంటున్న మాకు ప్రభుత్వ అధికారులు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయడంలో వెనకడుగు వేస్తున్నారు. కొన్ని రాష్ట్రాలలో ఈ సమస్యతో మా పిల్లలు చదువుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. జీవనాధారమైన వత్తులను చేసుకోవడానికి ప్రభుత్వం నుండి తగిన చేయూత ఇస్తూ వ్యక్తిగత లోన్లను బ్యాంకు ష్యూరిటీ లేకుండా ఇవ్వాలని కోరుతున్నాం.

బతుకుదెరువు కల్పించాలి

సుమన్, ఎబిఎంఎం ఎపి రాష్ట్ర ఆర్గనైజర్, తిరుపతి



తిరుమల పాపవినాశనంలో 60 ఏళ్లకు మునుపు అటవిశాఖ అధికారులు 27 మందికి వ్యాపారాలు చేసుకోవడానికి లైసెన్సులు మంజూరు చేశారు. శ్రీకాళహస్తి, ఏర్పేడు మండలాల పరిధిలో ప్రభుత్వాలు మా కోసం కేటాయించిన భూములను దౌర్జన్యంగా ఆక్రమించుకొని మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నారు. అధికారులకు చెప్పినా ఫలితం లేకుండా పోతోంది. దామినేడు, నక్కల కాలనీ, ఓటేరు ప్రాంతాల్లో ఉన్నవారికి ఉపాధి అవకాశాలను కల్పించాలి.


ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలి : సురేష్, పిసికిరాజపూర, మైసూరు, కర్నాటక



మైసూరు రాజుల కాలం నుండి మేము అడవినే నమ్ముకుని బతుకుతున్నాము. మమ్మల్ని కర్ణాటక రాష్ట్రం మైసూరులో హక్కి పిక్కి గా పిలుస్తారు. అడవినే నమ్ముకున్న తమకు జీవ వైవిధ్యం అడవిలో దెబ్బతింటుందని, ప్రత్యామ్నాయ జీవన మార్గాలను ఎంచుకోవాలని సూచించడంతో మేము తల వెంట్రుకలు పొడవుగా పెరగడానికి వనమూలికలతో తైలాన్ని తయారు చేస్తున్నాము. మేము తయారు చేసిన తైలానికి దేశవ్యాప్తంగానే కాకుండా ప్రపంచవ్యాప్తంగానూ గుర్తింపు వచ్చింది. మాకు మరింత ప్రోత్సాహకం అందాలంటే ప్రభుత్వాలు పథకాలను మాకు వర్తింప చేయాలి.

చంద్రబాబు హయాంలో మేలు జరిగింది

గోపికాలే, తెలంగాణా టిడిపి ఎస్టీసెల్ అధ్యక్షులు



చంద్రబాబు నాయుడు పాలనలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శికారీల సమస్యలపై ప్రత్యేక దష్టి సారించి బీసీ-ఏలో ఉన్న మమ్మల్ని ఎస్టీ జాబితాలో చేర్చారు. దేశవ్యాప్తంగా ఉన్న శికారిలు అందరూ ఏకతాటిపైకి వచ్చి హక్కుల కోసం పోరాడాలి. వాగ్రివేల్ కమ్యూనిటీగా ప్రత్యేక గుర్తింపును ఇస్తూ జీవనోపాదులను కల్పించాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. ఇకనైనా తారతమ్యాలు లేకుండా అందరం ఐక్యతతో సమస్యలపై పోరాడుదాం.

ఎపి పీజీసెట్‌ను రద్దు చేయాలి

'రౌండ్‌టేబుల్లో' విద్యార్థిసంఘాల డిమాండ్

ప్రజాశక్తి - క్యాంపస్

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నత విద్యామండలి నిర్వహిస్తున్న పీజీ కామన్ ఎంట్రన్స్ పరీక్ష రద్దు చేసి, యూనివర్సిటీలే ప్రవేశ పరీక్షను నిర్వహించేల అవకాశం కల్పించాలని విద్యార్థిసంఘాలు డిమాండ్ చేశాయి. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని అన్నమయ్య భవన్ ఎదుట విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యుఐ, జివిఎస్, నల్సా, బీసీఎస్యు, ఎస్టీ ఎస్సీ సెల్, ఓబీసీఎస్యు, జేబిఎస్ఎఫ్ సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ చైర్మన్ హేమచంద్రరెడ్డి, కార్యదర్శి నజీర్ అహమ్మద్ చేసిన దారుణమైన నిర్ణయాల వల్ల రాష్ట్రస్థాయి పీజీ పరీక్ష వలన ప్రవేశాలు పూర్తిస్థాయిలో తగ్గాయన్నారు. 2021 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్సిటీలలో పూర్తి స్థాయిలో వివిధ విభాగాల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయిలో ఉమ్మడి పీజీ ప్రవేశ పరీక్ష నిర్వహించడం ద్వారా విద్యార్థులకు సంబంధిత నోటిఫికేషన్ గురించి పూర్తి వివరాలు తెలియకపోవడంతో ఎంతోమంది ఉన్నత విద్యకు దూరం అవుతున్నారన్నారు. ఆయా సంబంధిత వర్సిటీలకే పీజీ ప్రవేశ పరీక్షలు నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే యూనివర్సిటీల బంద్‌కు పిలుపు ఇస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బండి చలపతి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అక్బర్, ఎన్ఎస్యుఐ రాష్ట్ర కార్యదర్శి జెన్నే మల్లికార్జున, విద్యార్థి కార్మిక సంఘ నాయకుడు చిన్న, జివిఎస్ వ్యవస్థాపకుడు శివ శంకర్ నాయక్, నల్సా వ్యవస్థాపకుడు సుందర్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలో...

రైతు 'బే' జార్



- పుత్తూరులో కలగా మిగిలిన రైతు బజార్లు
- అధికారులకు పన్నుల వసూళ్లపై ఉన్న శ్రద్ధ నిర్వహణపై లేదు
- మౌలిక వసతులు కూడా లేని దైన్యం
- మహిళా రైతులు మార్కెట్‌కు వచ్చేదెలా ?
- రైతు బజార్‌ను పునరుద్ధరించాలని డిమాండ్



గతంలో మామిడి మండి వద్ద ఏర్పాటుచేసిన స్థలం

రైతులు నేరుగా తమ పంటను అమ్ముకుని వారే లాభాలను గడించాలని, వారి అభివృద్ధికోసం ఏర్పాటు చేయబడ్డ రైతు బజార్లు నేడు రైతులు రాక బావురు మంటున్నాయి. మామూలు మార్కెట్‌లాగే మధ్యవర్తుల చేతుల్లోకి కూరగాయలు, తదితర రైతు బజార్ వ్యాపారాలు వెళ్లిపోయాయి. పుత్తూరు రైతు బజార్ గతంలో టీడీపీ ప్రభుత్వంలో ఏర్పాటయింది. కొంత కాలం సవ్యంగా నడిచినా, మరలా వైసీపీ ప్రభుత్వం రావడంతో రైతు సంక్షేమ ధ్యేయం అటకెక్కింది. పుత్తూరు రైతు బాజార్‌లో పన్నులు వసూళ్ల విషయంలో అటు మున్సిపల్ అధికారులు, ఇటు వ్యవసాయ మార్కెట్ అధికారుల వాదులాట రైతుల పాలిట శాపంగా మారింది. రైతు బేజారై రోడ్డున పడ్డ పూత్తూరు రైతుల గాథ (వ్యథ) ఇది.



ఎండలోనే కూరగాయలు అమ్ముతున్న దృశ్యం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: వ్యాపారులు, రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన రైతు బజారు జిల్లాలో అన్ని పట్టణాలలో ఉంది. అయితే పుత్తూరులో మాత్రం కలగానే మిగిలిపోయింది. ఈ విషయమై గతంలో టీడీపీ ప్రభుత్వంలో పుత్తూరు మార్కెట్ యార్డులో రైతు బజార్లు ఏర్పాటు చేశారు. అనంతరం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతు బజారు కేంద్రాల్లో మున్సిపల్ అధికారులు, వ్యవసాయ మార్కెట్ కమిటి వారు రైతులను, వ్యాపారులను పన్నులు చెల్లించాల్సిందిగా ఆదేశించారు. అయితే ఒకేసారి ఇద్దరికి పన్నులు చెల్లించలేక చాలామంది రైతులు, రైతు బజారుకు రావడమే మానేశారు. ఈ నేపధ్యంలో మున్సిపల్ అధికారులు, వ్యవసాయ మార్కెట్ కమిటి చెందిన అధికారుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఎవరూ పట్టు సడలించక, సమస్య ఒక కొలిక్కిరాక రైతులు రోడ్డున పడ్డారు. రైతులు పండించిన పంటలను అమ్మడానికి సరైన స్థలం లేకపోవడంతో చాలామంది రైతులు తమ సరుకులను, కూరగాయలను రోడ్డు ప్రక్కనే పెట్టుకుని ఎండకు, వానకు తడుస్తూ అమ్మ కాలు సాగిస్తున్నారు. ప్రస్తుతం మున్సిపల్ అధికారులకు మార్కెట్ రుసుం మాత్రం దర్జాగా వసూలు చేస్తున్నారు. రైతులకు మౌలిక వసుతులు కూడా ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం తమ అమ్మకాలకు సరైన ప్రదేశాలను కూడా చూపించడంలేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతు బజారు సమస్యలు పరిష్కరించి, రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



సివిల్ జడ్జి రాఘవేంద్ర

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మార్చి 8న జరిగబోయే జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.సి.రాఘవేంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవడం వల్ల సమయం, ధనం ఆదాఅవుతాన్నారు. లోక్ అదాలత్ తీర్పు అంతిమ తీర్పు దానిపై అప్పీల్ ఉండదని తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో అన్ని రకాల సివిల్ కేసులను, రాజీకి లోబడిన క్రిమినల్ కేసులను రాజీ చేసుకోవచ్చని తెలిపారు. పోలీసులు, న్యాయ వాదులు లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిస్కారం అయ్యేలా చొరవ చూపాలన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి సర్వే



దివ్యాంగుల సంక్షేమ ఇంటింటి సర్వే చేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రాష్ట్ర న్యాయ సేవ అధికారి సంస్థ అధ్యక్షులు ఎస్.సి.రాఘవేంద్ర ఆదేశాలు మేరకు పుట్టుకతో అంగవైకల్యం కలిగిన18 సంవత్సరాలు లోపు వారి సంక్షేమంకోసం 24వ తేదీ వరకు ఇంటింటి సర్వే నిర్వహిస్తారు. ఈ సర్వేలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, పారా లీగల్ వాలంటీర్లు, కోర్టు సిబ్బంది పాల్గొంటారు. శుక్రవారం నిర్వహించిన సర్వేలో ఏఎిఎం హేమలత, ఆశ వర్కర్ హారిక, పారా లీగల్ వాలంటరీ కే.విజయ్ కుమార్, కోర్టు సిబ్బంది హరికృష్ణ పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి



శిబిరంలో రక్తదానం చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రమాదాల్లో గాయపడిన వారికి రక్తదాన శిబిరాల ద్వారా సేకరించిన రక్తంతో ప్రాణాలు కాపాడవచ్చని గూడూరు ఆర్టీవో కిషోర్ పేర్కొన్నారు. గూడూరు మండల పరిధిలోని పోటుపాలెం వద్ద ఉన్న ఆర్టీవో కార్యాలయంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్టీవో కిషోర్ రక్తదాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎం.వి. ఐలు సునీల్, జకీర్, ప్రభాకర్ రావు, శాంతి , తదితరులు పాల్గొన్నారు.

వేగం కన్నా.. ప్రాణం మిన్న



రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : డ్రైవింగ్ చేసేటప్పుడు జాగ్రత్తగా వాహనాలు నడపాలని, వేగం కంటే ప్రాణం ఎక్కువ. విలువైనదని పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.చంద్రమౌళి అన్నారు. శుక్రవారం పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రహదారి భద్రత (రోడ్ సేఫ్టీ) అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు పుత్తూరు పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కేవీ సురేంద్ర నాయుడు ముఖ్య అతిథిగా విచ్చేశారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువకులు ట్రిఫిక్ నిబంధనలకు తప్పకుండా పాటించాలన్నారు.ఈ సభలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కోటేశ్వరయ్య, వి.వీరయ్య, సదస్సు నిర్వాహకులు ఎన్.ఎస్.ఎస్. అధికారి డాక్టర్ బాబురావు, డాక్టర్ కే శ్రీనివాసులు, ఎ.నాగేశ్వరరావు, డాక్టర్ ఆర్.బి,వాణిశ్రీ, డాక్టర్ ఏ.దేవకి, డాక్టర్ వి.వాసవి, డాక్టర్ కందేరి శ్రీదేవి, డాక్టర్ గాయత్రి, మురళీమోహన్ రెడ్డి తదితర అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

స్త్రీ వ్యక్తిత్వ హననం హేయం



అసభ్యకర ఆరోపణలను ఖండిస్తూ ప్రకటన విడుదల చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - పిచ్చాటూరు (తిరుపతి జిల్లా): సామాజిక మాధ్యమాలలో ఎమ్మెల్యేపై వచ్చిన అసభ్యకర ఆరోపణలలో ప్రభుత్వ ఉద్యోగులు, అధికారుల పేర్లను ఎటువంటి సాక్ష్యాధారాలు లేకుండా ఇరికించారని, మహిళా ఉద్యోగుల గౌరవ మర్యాదలకు భంగం కలిగించే విధంగా వచ్చిన వార్తలను పిచ్చాటూరు మండల మహిళ ఉపాధ్యాయులు ఖండించారు. స్త్రీ వ్యక్తిత్వాన్ని హననం చేసే విధంగా వచ్చినటువంటి వార్తలపై శుక్రవారం విద్యాశాఖ కార్యాలయం ముందు ఒక ప్రకటన విడుదల చేశారు. పిచ్చాటూరు మండల విద్యావ్యవస్థను ఉన్నత స్థాయిలో నిలిపేందుకు కృషిచేస్తున్న మండల విద్యాశాఖ అధికారిణి పేరును, ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ హిందీ ఉపాధ్యాయిని పేరుని కూడా చేర్చడం హేయమన్నారు. ఈ కార్యక్రమంలో మహిళ ఉపాధ్యాయులతో పాటు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పన్నులు సకాలంలో చెల్లించండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు ఆస్తి, ఖాళీ స్థలాలపై పన్ను బాకాయిలు, ట్రేడ్ లైసెన్సుల పన్నులు సకాలంలో చెల్లించి పురపాలక అభివృద్ధికి తోడ్పడాలని కమిషనర్ వెంకటేశ్వర్లు శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు.

నారాయణలో ప్రపంచ రేడియో దినోత్సవం



రేడియో ప్రాముఖ్యతను వివరిస్తున్న వక్తలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రపంచ రేడియో దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నెల్లూరు రెడ్ ఎఫ్ఎమ్ విభాగం అధిపతి రాము, ఆర్. జే బీ.ఎం.కే , ఆర్. జే బానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతు ప్రపంచ రేడియో దినోత్సవం, ఫిబ్రవరి 13న జరుపుకుంటారన్నారు. అనంతరం జీవితంలో రేడియో ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.వి. రవిప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డా.జెవి భాస్కర్, ఇ.సి.ఇ విభాగాధిపతి, నీరజ, ఈవెంట్ కో ఆర్డినేటర్ యం.దివ్య వాణి, ఏట కొండారెడ్డి అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

దళితుల పొలాలకు దారి కల్పించండి

- ఆక్రమణలు తొలగించాలని సిపిఎం నిరసన



ప్రజాశక్తి - పిచ్చాటూరు: మండలంలోని ఓబుల రాజు కండ్రిగ దళితవాడ లోని పేదలు తమ పొలాలకు వెళ్లే బాటను పెత్తం దారులు ఆక్రమించుకోవడంతో ఇబ్బంది పడుతున్నారని, ఆక్రమణలు తొలగించాలని సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్ధన్ మాట్లాడుతూ ఓబులరాజుకండ్రిగ దళితులకు గత 20 ఏళ్లకు ముందు భూములు పంపిణీ చేసి బాటను ఏర్పరిచారన్నారు. అయితే ఆ బాటను గోవర్ధనగిరి గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు దౌర్జన్యంగా ఫెన్సింగ్ వేసి ఆక్రమించడమే కాకుండా, భూముల్లోకి వెళ్లనీకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో నిరసన తెలుపుతున్నామన్నారు. రెవెన్యూ సదస్సులో సైతం అర్జీ ఇచ్చామన్నారు. శుక్రవారం సర్వేయర్ గ్రామానికి వస్తున్నట్లు ప్రకటించడంతో వైసిపి నాయకుడు అందుబాటులో లేకుండా సర్వే చేయకుండా వాయిదా వేయడంపై దళితులంతా నిరసన తెలిపారు. రెవెన్యూ అధికారులు స్పందించని పక్షంలో దళిత, ప్రజాసంఘాల నాయకులను కలుపుకుని 'చలో ఓబుల్‌రాజు కండ్రిగ'కు పిలుపునిచ్చి ఆక్రమించిన బాట ఫెన్సింగ్‌ను తొలగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగలాపురం నాగరాజు, జయరామచంద్రారెడ్డి, ఆర్.మునిశంకర్, దళితులు మాలయ్య, రమేష్‌బాబు, రత్నమ్మ, మునేశ్వరి, చెంగమ్మ, రాజేశ్వరి, ఎర్రమ్మ, గోవిందమ్మ, యశోదమ్మ, రేవతి, శాంతి, నాగమ్మ, సుబ్బమ్మ పాల్గొన్నారు.

కేన్సర్ రహిత రాష్ట్రంగా చర్యలు : కలెక్టర్



ప్రజాశక్తి - తిరుపతి సిటి: కేన్సర్ రహిత రాష్ట్రంగా ఆరోగ్యాంధ్రప్రదేశ్ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. ముందుగానే గుర్తించడం ద్వారా మెరుగైన చికిత్స అందించి ప్రాణం కాపాడుకోవచ్చని తెలిపారు. ప్రపంచ కేన్సర్ దినం సందర్భంగా టాటా కేన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో అవగాహనకు 5కె వాకథాన్, సైకిల్ ర్యాలీని నెహ్రూ మున్సిపల్ హైస్కూలు నుంచి కలెక్టర్, ఎస్పి హర్షవర్ధన్‌రాజు, ఎంఎల్‌ఎ ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. వక్తలు మాట్లాడుతూ మంచి ఆహారపు అలవాట్లు, వ్యాయామం, మంచి జీవన విధానం ద్వారా కేన్సర్ రాకుండా నివారించవచ్చని అన్నారు. కేన్సర్ ఆస్పత్రి ప్రతినిధులు డాక్టర్ ప్రశాంత్, డిఎంహెచ్‌ఒ బాలాజీనాయక్, ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారథి పాల్గొన్నారు.

క్యాంపస్‌లో... శ్రీ వేంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్, అడ్వాన్స్డ్ రీసెర్చ్, తిరుపతి ద్వారా నెహ్రూ మునిసిపల్ గ్రౌండ్ నుండి స్విమ్స్ వరకు నిర్వహించిన 5 కి.మీ వాక్థాన్ కార్యక్రమంలో జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఎన్.ఎస్.ఎస్ సెల్ వాలంటీర్లు, విశ్వవిద్యాలయ హెల్త్ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. ఈ కార్యక్రమానికి కో-ఆర్డినేటర్ గా ఎన్.ఎస్.ఎస్. యూనిట్ 2 ప్రోగ్రాం ఆఫీసర్ డా.కనపాల కుమార్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఎన్.ఎస్.ఎస్ కో-ఆర్డినేటర్ డా.ఎ.చందూలాల్, యూనివర్సిటీ హెల్త్ ఆఫీసర్ డా.బి.బాలదత్తాత్రేయ, రిజర్వేషన్ సెల్ చైర్పర్సన్ డా.జె.బి.చక్రవర్తి, ఆయుర్వేద డాక్టర్ డా.చిరంజీవి పాల్గొన్నారు.

గ్రామీణ టూరిజన్ని ప్రోత్సహించేందుకు చర్యలు



ప్రజాశక్తి - క్యాంపస్ : ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ టూరిజం సెక్టార్‌ను ప్రోత్సహించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ప్రత్యేకమైన టూరిజం ప్యాకేజీలను, టూరిజం అవస్థాపన సౌకర్యాలను అభివృద్ధి చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రమణ ప్రసాద్ పేర్కొన్నారు. 'గ్రామీణ పర్యాటకం, సుస్థిర గ్రామీణ జీవనోపాదులపై రెండు రోజుల జాతీయ సదస్సు' శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన విభాగం, ఆర్థిక శాస్త్రం సంయుక్త ఆధ్వర్యంలో సెమినార్ హాల్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న పర్యాటక స్థలాలగురించి, విద్యాసంస్థల్లో ఉన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు అందరూ పర్యాటకలని ప్రోత్సహించాలని తెలిపారు. కాకతీయ విశ్వవిద్యాలయం,యూనివర్శిటీ క్యాంపస్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఆచార్య బి.సురేష్ లాల్ మాట్లాడుతూ గ్రామీణ పర్యాటక అభివద్ధి, గ్రామీణ ప్రాంతాలలో ఆర్థిక అభివద్ధిని తీసుకు రాగలదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య టి. లక్ష్మమ్మ, ఆచార్య వై. వెంకటరావు, డాక్టర్ పి.నీరజ, డాక్టర్ పి.మాధవి పాల్గొన్నారు.

వందల సంఖ్యలో పందులు మృతి

- దిక్కుతోచని స్థితిలో పందుల యజమానులు



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని చుట్టుప్రక్కల గ్రామాలలో పిచ్చిగుంట కులస్తులు పందులు మేపుకొని జీవనం సాగిస్తున్నారు. ఈ కులానికి చెందినవారు బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో ఎక్కువ సంఖ్యలోనే ఉన్నారు. వీరు ఒక్కో కుటుంబం ఐదు, ఆరు వందల పందులను మేపుకొని, వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తున్నారు. గురువారం నుండి ఆ మూగజీవాలకు ఏమైందో ఏమో? వందల సంఖ్యలో చనిపోతున్నాయి. సంబంధిత పశు వైద్యాధికారులకి తెలియజేయాలంటే వారు అందుబాటులో లేరు. ఫోన్లు చేసినా అధికారులు స్పందించడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. తమ పందులు ఎందుకు చనిపోతున్నాయో తెలుసుకుని వాటికి సరైన వైద్యం అందించాలని వారు కోరుతున్నారు. చనిపోయిన వందల జీవాలను పరిశీలించి, నష్టపోయిన యజమానులకు ఆర్థిక సహాయం అందించాలని కోరుతున్నారు.

బౌన్సర్ల దౌర్జన్యం దురదృష్టకరం : మంచు మనోజ్



ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): చంద్రగిరి మండలంలోని ఏ రంగంపేట సమీపంలోని శ్రీ విద్యానికేతన్ విద్యా సంస్థలు, మోహన్ బాబు విశ్వవిద్యాలయం వద్ద బౌన్సర్ల దౌర్జన్యం దురదష్టకరమని, ఇలాంటి వాటిని ప్రోత్సహించడం బాధాకరమని ప్రముఖ హీరో మంచు మనోజ్ అన్నారు. శ్రీ విద్యానికేతన్ విద్యాసంస్థల వద్ద గురువారం రాత్రి యఫ్ 5 రెస్టారెంట్ పై బౌన్సర్లు దాడి చేసి ధ్వంసం చేయడాన్ని ఖండిస్తూ మంచు మనోజ్ శుక్రవారం విద్యాసంస్థల ముందు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయం వంటి ఎంతో ప్రశాంతంగా ఉండిన విద్యాసంస్థలలో దౌర్జన్యాలు చోటు చేసుకోవడం బాధాకర మన్నారు. తన తండ్రి మంచు మోహన్ బాబు ఎంతో పవిత్ర ఆశయంతో విద్యాసంస్థలను ప్రారంభించారని మనోజ్ తెలిపారు. గత మూడు, నాలుగు సంవత్సరాలుగా విద్యాసంస్థలలో ఆగడాలు ఎక్కువవుతున్నాయి అని ఆవేదన వ్యక్తంచేశారు. విద్యా సంస్థల సమీపంలో పలువురు వసతి గహాలు, హెూటళ్ళు, దుకాణాలను నడుపుతున్నట్లు వివరించారు. అటువంటి వారిపైన బౌన్సర్ల సహాయంతో దౌర్జన్యాలు చేయించటం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. వసతి గహ నిర్వాహకుల నుంచి ప్రతి విద్యార్థికి కొంత మొత్తం విద్యాసంస్థ వసూళ్ళ చేస్తున్నట్లు పలువురు తన దష్టికి తీసుకుని వచ్చారని చెప్పారు. విద్యా సంస్థ ప్రస్తుత యాజమాన్యం చేసే దౌర్జన్యాలకు వసతి గహ నిర్వాహకులు, హాస్టళ్ల వారు భయభ్రాంతులకు గురై పారిపోతున్నట్లు తెలిపారు. ఇలాంటి విషయాలను యాజమాన్యం ప్రోత్సహించటం వలన ఇప్పటికే విద్యాసంస్థకు చెడ్డపేరు వచ్చిందని, ఇప్పటికైనా విష్ణు కలగజేసుకొని సరిదిద్దాలని మనోజ్ కోరారు. విద్యాసంస్థ అభివద్ధిలో తాను కూడా కీలక పాత్ర పోషించానని అలాంటిది ప్రస్తుతం ఇలా జరుగుతుండటంతో బాధితుల తరఫున మాట్లాడుతున్నట్లు మనోజ్ చెప్పారు. బాధితులతో కలిసి న్యాయపోరాటం చేయడానికి తాను సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించారు. అనంతరం చంద్రగిరి పోలీస్ స్టేషన్ కు చేరుకుని సి ఐ సుబ్బరామిరెడ్డికి బాధితులతో కలిసి ఫిర్యాదు చేశారు. విద్యాసంస్థల వద్ద దుశ్చర్యలకు పాల్పడిన వారి పైన కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కోట ప్రధాన రహదారిపై నూతన కల్వర్టు నిర్మించాలి



కల్వర్టును పరిశీలిస్తున్న నల్లపురెడ్డి వినోద్ కుమార్ రెడ్డి తదితరులు

ప్రజాశక్తి -కోట : కోట, ఆర్టీసీ బస్టాండ్ నుండి క్రాస్ రోడ్డు వరకు రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ మార్గంలో కోటలోని ఎన్సీఆర్ నగర్ ప్రాంతంలోనికి వెళ్లే రహదారి సమీపంలో కాలువపై ఉన్న కల్వర్టు పనులు మినహా మిగతా పనులు చురుగ్గా సాగుతున్నాయి.కల్వర్టు వెడల్పుతో పోలిస్తే కొత్తగా చేపట్టిన రోడ్డు విస్తరణ ఎక్కువైనందున వాహనాల రాకపోకలకు, కల్వర్టు పునర్నిర్మాణం తప్పనిసరి అయింది.ఇందుకు అదనపు నిధులు అవసరమైన నేపథ్యంలో మాజీ ఎంపీపీ నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి, తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకులు నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డిలు పలువురితో కలిసి శుక్రవారం ఉదయం కల్వర్టును ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం నల్లపరెడ్డి వినోద్ రెడ్డి మాట్లాడుతూ గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ సహకారంతో కోట మండలంలో అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని అన్నారు. కల్వర్టు నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరుకై ఎమ్మెల్యేతో మాట్లాడుతానని వినోద్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కోట గ్రామ పంచాయతీ సర్పంచ్ ఇండ్ల వెంకటరమణమ్మ, ఉపసర్పంచ్ గాది విజయభాస్కర్, కోట మాజీ ఎంపీటీసీ ఎస్దానిబాష ,షేక్ ఇక్బాల్, కోట పంచాయతీ వార్డు మెంబరు షేక్.రఫీ, ఏవీ సుబ్రహ్మణ్యం, మర్రి పోలయ్య స్థానికులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 21 నుంచి అంతర్జాతీయ సదస్సు

- బ్రోచర్లు విడుదల చేసిన వీసీలు అప్పారావు, ఉమ



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఏప్రిల్ 21వ తేదీ నుంచీ మూడు రోజుల పాటు నిర్వహించే అంతర్జాతీయ సదస్సు బ్రోచర్‌ను ఎస్వీయూ విసి చాంబర్‌లో శుక్రవారం వీసీ ఆచార్య సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతి నాయుడు, పద్మావతి యూనివర్సిటీ వీసీ ఆచార్య వి. ఉమ, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.రజనిలు ఆవిష్కరించారు. సైన్స్ అండ్ టెక్నాలజీ అప్లికేషన్ ఆఫ్ రేర్ ఎర్త్స్ అంశంపై మూడు రోజులపాటు నిర్వహించే ఈ సదస్సులో దేశ, విదేశీ ప్రతినిధులు పాల్గొని పరిశోధనా పత్రాలు సమర్పిస్తారు. రేర్ ఎర్త్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా - ఎస్వీయూనివర్సిటీ ఫిజిక్స్ విభాగం, పద్మావతి యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వీసీ తెలిపారు. ఈ కార్యక్రమంలో రేర్ ఎర్త్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు డాక్టర్ ఎం. ఎల్. పి. రెడ్డి, సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కెటి రామకృష్ణారెడ్డి, ఫిజిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ బి. దేవప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఏజెన్సీ వద్దు.. ఆప్కాస్ ముద్దు



ఆప్కాస్ రద్దు విరమించాలని ఉద్యోగ సంఘాల నేతలు సీఐటీయు మద్దతుతో ధర్నా చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - క్యాంపస్ : రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్ రద్దు ఆలోచనను విరమించుకోవాలని, జీవో నెంబర్ 2 సవరించి అందరికీ మినిమం టైమ్ స్కేలు వర్తింపజేయాలని కోరుతూ శుక్రవారం అగ్రికల్చర్ కాలేజీ మెయిన్ గేటు ఎదుట కాంట్రాక్టు ఉద్యోగ సంఘాల నేతలు సీఐటీయు ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఆప్కాస్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్నబాబు, సిఐటియు జిల్లా కార్యదర్శి జయచంద్రలు మాట్లాడుతూ ఆప్కాస్ రద్దు చేస్తే ఒక లక్షా 20 వేల మంది ఉద్యోగులకు నష్టం జరుగుతుందన్నారు. ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా నియామకాలు జరిపితే, పారిదర్శకత లోపిస్తుందని, రాజకీయ ప్రమేయం, ఇతర అనైతిక ప్రభావం పెరుగుతుందన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ సరిగ్గా అమలు కాదన్నారు. ప్రభుత్వమే నేరుగా నియామక ప్రక్రియ నిర్వహించి, ఆంధ్రప్రదేశ్ కార్పొరేట్ అవుట్ సోర్సింగ్ సంస్థ ద్వారా ఉద్యోగులను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆప్కాస్ యూనియన్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

బైక్‌లు ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు





అపస్మారక స్థితిలో మణి, గాయాలతో భగీరథ

ప్రజాశక్తి - రామచంద్రపురం: మండలం కేంద్రంలోని, రామచంద్రా పురం - పచ్చికాపలం రోడులో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పెట్రోల్ బంక్ వద్ద శుక్రవారం ఉదయం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాల య్యాయి. ఆర్ సి పురం ఎస్సై రామాంజనేయులు తెలిపిన వివరాల మేరకు శుక్రవారం ఉదయం వెదురు కుప్పం మండలం, మాంబేడుకు చెందిన భగీరథ మోటార్ సైకిల్‌లో తిరుపతి వైపు వెళుతుండగా, అదే సమయంలో తిరుపతి రూరల్ మండలం ముళ్ళపూడి గ్రామానికి చెందిన ముత్తుమారి మణి తిరుపతి నుండి రామ చంద్రపురం వైపు మోటార్ సైకిల్‌లో వస్తూ పెట్రోల్ బంకు వైపు తిరుగుతుండగా రెండూ బైకులు ఢీకొన్నాయి.ఈ ప్రమాదంలో ముత్తుమారి మణి తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. భగీరథకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులు ఇద్దరిని 108 వాహనంలో తిరుపతికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.

ముగిసిన పుస్తక రచనా లేఖకుల కార్యశాల

ప్రజాశక్తి - క్యాంపస్ : రెండు రోజులపాటు జరిగిన వివిధ భాషలలో పుస్తక రచనా లేఖకుల కార్యశాల శుక్రవారంతో ముగిసింది. ఈ కార్యశాల యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్, భారతీయ భాషా సమితి, కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం న్యూఢిల్లీ, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం తిరుపతి సంయుక్తాధ్వర్యంలో జరగింది. 22 భారతీయ భాషలలో హైయ్యర్ ఎడ్యుకేషన్ సిస్టమ్స్‌లో, వివిధ సబ్జెక్ట్సకు సంబంధించిన అంశాల పుస్తక రచనా లేఖకుల కార్యశాల చెలికాని అన్నారావు కాన్ఫరెన్స్ హాలులో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిథిగా యుజిసి జాయింట్ సెక్రటరీ డా.అర్చనా ఠాకూర్ విచ్చేశారు. ఆమె మాట్లాడుతూ భారతీయ జ్ఞానాన్ని పెంపొందించే గ్రంథాలను లేఖకుల ద్వారా రాయాలని సూచించారు. మీరు రంచించే గ్రంథాలు భారతీయ భవిష్యానికి ప్రతీకలుగా ఉంటాయని తెలిపారు. విశిష్టాతిథి శ్రీ వేంకటేశ్వర వైదిక సంస్కృత విశ్వవిద్యాలయం విసి ప్రొ.రాణీ సదాశివమూర్తి గ్రంథరచనను చాలా జాగ్రత్తగా చెయ్యాలని సూచించారు. నేడు మీరు రచించే గ్రంథాలే వందసంవత్సరాల దేశ భవిష్యత్తుకు పునాదులన్నారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ కె.వెంకటనారాయణరావు మాట్లాడుతూ పుస్తకరచన ఎంతముఖ్యమైనదో ప్రసంగించిన వక్తల మాటల్లో వ్యక్తీకృతమైనదని, అధ్యాపకులకు యుజిసి ద్వారా దేశభవిష్యత్తుకు అవసరమైన గ్రంథ నిర్మాణకార్యం ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ డా.సూర్యప్రసాద్, ప్రొ.కె.గిరిధరరావు, కో-ఆర్డినేటర్ ప్రొ.ఎ.సచ్చిదానందమూర్తి, అడిషనల్ కో-ఆర్డినేటర్ డా.ఎ.శేఖర్ రెడ్డి, కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు మొదలగు రాష్ట్రాల నుండి వచ్చిన 50 మందికి పైగా పుస్తక రచయితలు పాల్గొన్నారు.

రాకేష్ చౌదరి కుటుంబానికి అండగా ఉంటాం



మంత్రి లోకేష్‌తో రాకేష్ చౌదరి కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి): ఏనుగుల దాడిలో మృతి చెందిన కందులవారిపల్లె ఉపసర్పంచ్ రాకేష్ చౌదరి కుటుంబానికి కొండంత అండగా ఉంటామని మంత్రి లోకేష్ అన్నారు. శుక్రవారం రాకేష్ చౌదరి కుటుంబ సభ్యులు ఉండవల్లి నివాసంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిశారు. పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా ఉండే రాకేష్ చౌదరి మృతి చెందడం నన్ను కలచి వేసిందని లోకేష్ అన్నారు. వారి కుటుంబానికి అన్నివిధాల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

పిల్లల భవితకు అంగన్వాడీల్లో పునాది

ప్రజాశక్తి - నాగలాపురం: పిల్లల భవితకు అంగన్వాడీ కేంద్రాలలోనే గట్టి పునాదులు వేయాలని, ఈ దిశగా పిల్లల పోషక విలువలు, చదువు ఆవశ్యకతను చాటి చెప్పడానికి అంగన్వాడీ కార్యకర్తలు కృషి చేయాలని స్థానిక వైద్యాధికారి విజయ్ కుమార్ పిలిపునిచ్చారు. పోషణ్ భీ - పడావో భీ అంశంపై అంగన్వాడి కార్యకర్తలకు ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో పిచ్చాటూరు ఐసిడిఎస్ సిడిపిఓ శోభారాణి ఆధ్వర్యంలో శుక్రవారం శిక్షణ తరగతులు నిర్వహించారు.